31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

మంగళవారం, జూలై 28, 2026 పేజీలు : 8

## ఎత్తిపోతల మోటర్లు మరమ్మతు చేసి నీరు ఇవ్వాలి

-ఆగస్టు 1లోగా పంపుసెట్లు సిద్ధం చేయాలి

-మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి



**చురకలు విలేకరి, బీర్పూర్, జూలై 27:** ఎత్తిపోతల పంపుసెట్ల మరమ్మతు చేపట్టి ఖరీఫ్ పంటకు నీరు అందించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బీర్పూర్ మండలం కొల్వాయి ఎత్తిపోతల పథకాన్ని రైతులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కాలిపోయిన మోటార్లు, ట్రాన్స్ఫార్మర్లు లేక నీళ్లు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ డిఈ, ఎస్ఈలతో ఫోన్‌లో మాట్లాడిన జీవన్ రెడ్డి, కొల్వాయి, ఆరేపల్లిలో మోటార్లు మరమ్మతు చేయించాలని, ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న -మిగతా 2లో

### బాధితుల సమస్యలకు

## తక్షణ పరిష్కారానికి చర్యలు



జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 27 :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నా మని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమా ర్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 24 మంది ఆర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితు ల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్య లు తీసుకొవాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబం ధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టప రంగా బాధితులకు న్యాయం జరిగే విధం గా చూడాలని, ఫిర్యాదుదారునికి భరో సా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

### బోర్నపల్లి బ్రిడ్జికి కేటాయించిన

# కోటి నిధులు ఏమయ్యాయి?

- మాజీ మంత్రి జీవన్ రెడ్డిని వ్యాఖ్యలు ఆశ్చర్యం కల్గిస్తున్నాయి
- జీవన్ రెడ్డి, అరవింద్ గతంలో లాగే ఇప్పుడు కలిసి పని చేస్తున్నారా?
- బోర్నపల్లి బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం
- జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 27 :** బోర్నపల్లి బ్రిడ్జికి కేటాయించిన కోటి నిధులు ఏమయ్యాయని, మాజీ మంత్రి జీవన్ రెడ్డిని వ్యాఖ్యలు ఆశ్చర్యం కల్గిస్తున్నాయని, జీవన్ రెడ్డి, అరవింద్ గతంలో లాగే ఇప్పుడు కలిసి పని చేస్తు న్నారని, బోర్నపల్లి బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని జగి త్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని మోతే రోడ్డులోని పార్టీ కార్యాలయంలో సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సం జయ్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూబోర్నపల్లి – జగన్నాథపూర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేస్తే మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయన్నారు.కేంద్ర మంత్రి జువెల్ ఓరం రాయికల్‌లో బ్రిడ్జి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని, ఎంపీ అరవింద్ తో కలిసి ఢిల్లీలో వినతిపత్రం ఇచ్చామని గుర్తు చేశారు. ఈ బ్రిడ్జి ఎస్టీ వెల్ఫేర్ శాఖ పరిధిలో ఉండడంతో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరగా, తన సూచన మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారని తెలిపారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ బాధ్యతలు చేపట్టిన వెంటనే బ్రిడ్జిపై తొలి సంతకం చేశారని, కాంట్రాక్టర్లు పని చేయకపోవ డంతో మళ్లీ టెండర్ ప్రక్రియ చేపట్టాలని, కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరామని వివరించారు. బోర్నపల్లి బ్రిడ్జికి కోటి రూ పాయలు మంజూరయ్యాయని, అధికారు లతో వెళ్లి ప్రజలకు చెప్పారని గుర్తు చేశారు. ఆ నిధులు ఏమయ్యాయని ప్రజ లు ప్రశ్నిస్తున్నారన్నారు.రోడ్డు భవనాలు శాఖ మంత్రిగా ఉండి ఇటిక్యాల, రామా రావుపల్లి, రామాజీపేట, కోనాపూర్, మైతాపూర్ బ్రిడ్జిలు ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. గత 25 ఏళ్లు బిఆర్ఎస్, కేసిఆర్ కుటుంబాన్ని విమ ర్శించి, నేడు రహస్య ఒప్పందంలో భాగంగా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ఆరోపించారు. ఎంపీ అరవింద్, జీవన్ రెడ్డి గతంలోలాగే ఇప్పుడు కలిసి పని చేస్తున్నారా అనే -మిగతా 2లో

## కలిసికట్టుగా సర్ పై దృష్టి సారించాలి

- గడప గడపకు వెళ్ళి ఓటర్లను జాబితాలో చేర్చాలి
- పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలి
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు







**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 27 :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగాతెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు హాజరయ్యారు. అ నంతరం కౌన్సిలర్లు, వార్డ్ ఆఫీసర్లు బూత్ లెవెల్ -మిగతా 2లో

### ప్రజావాణికి ఫిర్యాదు వచ్చిన

## అరగంటలోనే కలెక్టర్ స్పందన





- చిన్న బోనాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ
- ఇటీవల ఎంజేపీ బాలుర విద్యాలయం ప్రిన్సిపాల్ సస్పెండ్ నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థు లకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచన

**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, జూలై 27 :** సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్న బోనాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో నీటి సరఫరాలో ఇబ్బందులు, ఇతర సమస్యలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు వచ్చిన అరగంటలోనే స్పందించిన జిల్లా కలెక్టర్ ఆ విద్యాల యాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా డైనింగ్ హాల్ కి వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా, వారితో మాట్లాడారు. మెనూ -మిగతా 2లో

## విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల,జూలై 27 :** విద్యార్థులపై పెరుగుతున్న విద్యా ఫీజుల భారాన్ని తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ యువమోర్చా జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఫీజుల బకాయి – బిజెపి లడాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ డా. బోగ శ్రావణి మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేయడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15,000కు పైగా ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ విద్యార్థుల సమస్యపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేవైఎం అధ్యక్షులు ఇట్టేడి రాజు మాట్లాడుతూ విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను తెలియజేయడానికి క్యూఆర్ కోడ్, 8239523455 నంబర్ కు మిస్ కాల్ ఇచ్చి మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, దిటి వెంకటేష్, ఆముద రాజు, పవన్, బీజేవైఎం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన జువ్వాడి నర్సింగరావు





**చురకలు ప్రతినిధి కోరుట్ల జూలై,27 :** హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ని సోమవారం తెలంగాణ రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీకి పూల బొకేను అందజేసి,శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రాష్ట్రంలోని పలు అంశాలపై స్వల్పంగా చర్చించి,డీజీపీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

## వెల్గటూర్ రైతువేదికలో విత్తన మేళా



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జులై 27 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ రైతు వేదికలో సోమవారం మండల వ్యవసాయాధికారి పెండ్యాలసాయికిరణ్ ఆధ్వర్యంలో విత్తన మేళా కార్యక్రమం నిర్వహించారు. మండల రైతులకు కంది, పెసర, మొక్కజొన్న, వివిధ రకాల కూరగాయల విత్తనాల ను అందుబాటులో ఉంచడం తోపాటు, వర్షాభావ పరిస్థితు లను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలసాగు ప్రాముఖ్యత,నాణ్యమైన విత్తనాల వినియోగంవల్ల అధిక దిగుబడులు సాధించే అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు ప్రస్తుత పరిస్థిలో ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. వరి విస్తీర్ణం తగ్గించి మిగితా పంటల పై దృష్టిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ రత్నాకర్, కప్పారావు పేట సర్పంచ్ పోచయ్య, రాజక్కపల్లి సర్పంచ్ మల్లేశం, మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు ప్రతాప్ రావ్, వ్యవసాయ విస్తరణ అధికారులు రవళి, ఫిర్దోస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్, వెల్గటూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ సందీప్, వెల్గటూర్ మండల విత్తన డీలర్స్ మరియు అధిక సంఖ్యలోరైతులుపాల్గొన్నారు.

# వేములకుర్తి కళావేదికలో నృత్య ప్రదర్శకులకు సన్మానం

**-తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన న్యూ విజన్ స్కూల్ విద్యార్థులు**

**- భరతనాట్య కళాకారుడు బండమిది శ్రీధర్‌కు ప్రత్యేక అభినందనలు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (27) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామానికి చెందిన న్యూవిజన్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు,భరతనాట్య కళాకారుడు బండమిది శ్రీధర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చి ప్రశంసలు అందుకున్నారు.వారి విజయాన్ని పురస్కరించుకుని సోమవారం వేముల కుర్తి గ్రామ పంచాయతీ కళావేదికలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు.తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో మీనాక్షి నృత్య కళానిలయం ఆధ్వర్యంలో, అభినయ ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీలలో న్యూ విజన్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు పాల్గొని అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.తమ నాట్య నైపుణ్యంతో ప్రేక్షకులను ఆకట్టుకుని ప్రత్యేక గుర్తింపు పొందడంతోపాటు పలువురి ప్రశంసలు అందుకున్నారు.ఈ సందర్భంగా అభినయ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు బి.ఎన్. రెడ్డి, నాట్య గురువు నాట్య మయూరి మాస్టర్ శ్రీవాణి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు.అలాగే న్యూ విజన్ కాన్వెంట్ స్కూల్ కరస్పాండెంట్ గుమ్మల తిరుపతిని సైతం సత్కరించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయంతో గ్రామానికి మంచి పేరు తీసుకు వచ్చారని వేములకుర్తి సర్పంచ్ తరి రామనుజం అన్నారు. ఈ సందర్భంగా నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, బండమిది శ్రీధర్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయిల్లో ప్రతిభ కనబర్చి గ్రామానికి, జిల్లాకు కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ అంకతి రాజన్న, పంచాయతీ కార్యదర్శి ముదాం బాలముకుందం, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎడిపెల్లి మురళి, నాయకులు పెంట లింబద్రి, నాంపల్లి వెంకటాద్రి,అంకతి రాజలింగం ,దోనికెన రాజేష్,రాధరపు ప్రకాష్, పుప్పాల నాగేష్, ఎడిపెల్లి భూమన్న, గుడ్ల రఘు, దోనికెన శ్రీనివాస్, పట్నం నవీన్, విద్యార్థులు,తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 27 :** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు,వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి 67ఫిర్యాదులు,వినతులు వచ్చాయని,వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలి



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, జూలై 27 :** ప్రస్తుతంఎల్‌నినో పరిస్థితుల కారణంగా ఏర్పడిన వర్షాభావం వల్ల వరిసాగు చేయకుండా ఆ స్థానంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని మండలం వ్యవసాయ అధికారీ ఏ.దీపిక రైతులకు సూచించారు. ఈ మేరకు మండలంలోని వెల్లుల రైతు వేదికలో ఈ నెల 27 నుంచి 29 వరకు విత్తన మేళా కార్యక్రమం ఉంటుందని ఇందులో మొక్కజొన్న, కందులు, కూరగాయలు తదితర విత్తనాలు కూడా అందుబాటులో ఉంటాయని రైతులు ఈ విత్తన మేళను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేష్, మమత, సంధ్య,పద్మావతి ఏఈఓ లు మరియు రైతులు పాల్గొన్నారు.

## 6లక్షల ఎల్వోసిని అందించిన ఎమ్మెల్యే



**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 27 :** జగిత్యాల పట్టణానికి చెందిన మామిడాల కిషోర్ కుమార్ జీర్ణ వ్యవస్థ సంబంధిత సమస్యతో బాధపడుతూ చికిత్స చేసుకునే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతుండగా ఈవిషయాన్ని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మామిడాల కిషోర్ కు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం 6 లక్షల రూపాయల విలువ గల ఎల్వోసిని కిషోర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, కౌన్సిలర్ ఆయ్యుబ్, సుమేర్, ప్రవీణ్ రావు, ఆకుల మల్లేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన డీసీఆర్‌బీ డీఎస్పీ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 27 :** జగిత్యాల జిల్లా డీసీఆర్‌బీ డీఎస్పీగా రవి కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం జగిత్యాల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ రవి కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లాలో పోలీసు శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. రవి కుమార్ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో మెట్ట పంటల సాగుపై రైతులకు అవగాహన



**చురకలు ప్రతినిధి కోరుట్ల జూలై 27 :** కోరుట్ల మండలం ఐలాపూర్ రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్‌నినో ఎఫెక్ట్ -- వర్షాభావ పరిస్థితుల్లో మెట్ట పంటల సాగు అంశంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు తక్కువ నీటితో సాగయ్యే మెట్ట పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పెసలు, మినుములు, కందులు, సోయాబీన్, వేరుశనగ, జొన్న, పొద్దుతిరుగుడు వంటి పంటలు తక్కువ నీటితో మంచి దిగుబడిని అందిస్తాయని తెలిపారు. ఈ పంటల సాగుతో పెట్టుబడి భారం తగ్గడంతో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందని వివరించారు. అలాగే ఐలాపూర్ రైతు వేదికలో మూడు రోజుల పాటు విత్తన మేళా నిర్వహించనున్నట్లు ప్రకటించి, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చీడపీడల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటే దిగుబడి మరింత మెరుగు పడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అంజిరెడ్డి, గ్రామ సర్పంచ్ రామకృష్ణ, వ్యవసాయ అధికారి నాగమణి, ఏఈవోలు శ్రీహరి, ఫమీనా, అనిల్, నవిత, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా ఏఏ గ్రూప్, జమాతే ఇస్లాం హింద్



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 27 :** కోరుట్ల పట్టణంలోని అరఫాత్‌పుర కబ్రస్తాన్ వెనుక ప్రాంతంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి ఓ ఇల్లు కూలిపోయింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే AA గ్రూప్ అధినేత ఏఏ నయీం సేట్ స్పందించి బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. వారి అవసరాలను తెలుసుకుని నిత్యావసర సరుకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అదేవిధంగా జమాతే ఇస్లాం హింద్ సంస్థ సభ్యులు కూడా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. వారి సేవాభావాన్ని స్థానికులు అభినందించారు. అధికారులు కూడా బాధిత కుటుంబానికి తగిన సహాయం అందించాలని స్థానికులు కోరారు.

## స్త్రీనిధి రుణాలతో ఆదాయభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా చూడాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 27 :** జిల్లాలో మహిళ సంఘాల సభ్యులు స్త్రీనిధి రుణాలతో ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా స్త్రీనిధి, సెర్ప్ సిబ్బంది చూడాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో స్త్రీనిధి జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెర్ప్, స్త్రీనిధి సిబ్బంది సమన్వయంతో జిల్లాకు ఉన్న టార్గెట్లు పూర్తి చేయాలని, బకాయిలు లేకుండా చూడాలని, డిజిటల్ పద్ధతి ద్వారా లావాదేవీలు జరిగేలా చూడాలన్నారు. అనంతరం అదనపు జిల్లా కలెక్టర్ రాజగౌడ్ మాట్లాడుతూ మైక్రో ఫైనాన్స్ బారిన పడకుండా గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలకు అండగా స్త్రీనిధి సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని, స్త్రీనిధి రుణాలు సక్రమంగా అందేలా సిబ్బంది చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి యం. రఘువరన్, జిల్లా వ్యవసాయ అధికారి రఘువీర్, మృత్యు శాఖ అధికారి, పశు సంవర్ధక శాఖ అధికారి, జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి పి. సునీత, స్త్రీనిధి రిజనల్ మేనేజర్ రాం నారాయణ, మెప్మా ఏవో శ్రీనివాస్, జిల్లా బ్యాంక్ లింకేజి డిపియం ఎస్. రమేష్, డి. మెప్మా డి.యం.సి.సునీత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరోజ, కార్యదర్శి ఆమనీ, కోశాధికారి హరిత, అన్ని మండలాల ఎపియం లు, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్‌లో ఎరువులు అమ్ముతున్న డీలర్ల లైసెన్సులు రద్దు చేయాలి

**-మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 27 :** ఎల్నినో ప్రభావంతో ఇప్పటికే ఆందోళనలో ఉన్న రైతులను యూరియా, డీఏపీ ఎరువుల బ్లాక్ మార్కెట్‌తో మరింత దోచుకుంటున్నారని మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యం కావడం, వర్షపాతం అస్థిరంగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం అండగా ఉండాల్సింది పోయి, ఎరువులు ఎమ్మార్పి ధరలకు అందకుండా బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నారని, ఇది కాలం తెచ్చిన కరువు కాదు, రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు అని విమర్శించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఎరువుల ధరల నియంత్రణలో విఫలమైందని, సబ్సిడీ పేరుతో రైతుపై భారం మోపుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంలో విఫలమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల దుకాణాలపై తనిఖీలు చేసి, ఎమ్మార్పి కంటే ఎక్కువకు అమ్మే డీలర్ల లైసెన్సులు రద్దు చేయాలని, యూరియా, డిఏపి ఎమ్మార్పీకే అందేలా కేంద్ర-రాష్ట్ర సంయుక్త పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎల్నినోతో నష్టపోయే రైతులకు ప్రత్యేక సహాయం ప్రకటించాలని, బ్లాక్ మార్కెట్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పిఏసిఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అయిల్నేని ఆనంద్ రావు, తుమ్మ గంగాధర్, తేలు రాజు, ఎల్లా రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతు బజార్ రహదారిపై ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

**-ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన పోలీసులు - మున్సిపల్ అధికారులు**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 27 :** జగిత్యాల పట్టణంలోని రైతు బజార్ పరిసర ప్రాంతంలో రహదారులపై కూరగాయల విక్రయాల కారణంగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు టౌన్ సీఐ పి. కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, రోడ్డుపై వ్యాపారం చేస్తున్న హోల్‌సేల్, రిటైల్ కూరగాయల వ్యాపారులను రైతు బజార్ ప్రాంగణం లోకి తరలించారు. జగిత్యాల ట్రాఫిక్ ఎస్ఐ బి. మల్లేశ్, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వ్యాపారులతో సమావేశమై రహదారు లపై వ్యాపారం వల్ల ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. అధికారుల సూచనలకు వ్యాపారులు సానుకూలంగా స్పందించి స్వచ్ఛందంగా రైతు బజార్ లోకి వెళ్లి తమ వ్యాపారాలను ప్రారంభించారు. మార్కెట్‌లో పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైతు బజార్ ప్రాంగణంలోకి ద్విచక్ర వాహనాలు, ఆటోరిక్షాలు ప్రవేశించకుండా ప్రవేశ ద్వారాల వద్ద నిషేధ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారాయి. ఇకపై రైతు బజార్ వెలుపల రహదారులపై కూరగాయల వ్యాపారం నిర్వహించకుండా అందరూ సహకరించాలని అధికారులు కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

**-మండల వ్యవసాయ అధికారి ఎ.దీపిక**



**చురకలు విలేకరి, మెట్ పల్లి, జూలై 27 :** మెట్ పల్లి పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి ఎ.దీపికా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా షాపుల్లోని నిల్వలు, సేల్స్ రిజిస్టర్లు, బిల్ బుక్స్ తదితర వివరాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఎ.దీపికా మాట్లాడుతూ... ఎరువుల దుకాణ వ్యాపారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని సూచించారు. ఎరువులను నిర్దేశించిన ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. రైతుల వద్ద నుంచి అధిక ధరలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే దుకాణాల లైసెన్సులు రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రాధాన్యత అని, ఎరువుల దుకాణా వ్యాపారులు సహకరించాలని ఆమె కోరారు.

# క్రమశిక్షణ,నిబద్ధతతో ప్రజల మన్నలను పొందేలా పని చేయాలి

**-విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు**

**-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జులై 27 :** క్రమశిక్షణ,నిబద్ధతతో ప్రజల మన్నలను పొందేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది పని చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ అవరణలోని పరేడ్ మైదానంలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ ,సివిల్,హోమ్ గార్డ్ సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్ కి జిల్లా ఎస్పీ గారు హాజరై గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్ ప్రదర్శనని పరిశీలించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ప్రతిరోజు కనీసం అరగంట నడక చేయడం, బయట ఆహారాన్ని వీలైనంత వరకు నివారించడం,క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఎస్పీ గారు సూచించారు.వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి క్రమశిక్షణ,యూనిటీగా ఉండడం,ఫిజికల్ ఫిట్నెస్‌కి ఉపయోగ పడుతుందన్నారు.క్రమశిక్షణతో డ్యూటీలు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందే లాగా పనిచేస్తూ పోలీస్ శాఖకి, జిల్లాకి మంచి పేరు తెచ్చేలాగా పని చేయాలని అన్నారు.విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని,సిబ్బందికి ఏదైనా సమస్య వుంటే ఎప్పుడైనా తనను కలుసుకొని తమ సమస్యను తెలియజేవచ్చాన్నారు. ఈపరేడ్‌లో అదనపు ఎస్పీ చంద్రయ్య ,ఆర్.ఐలు మధుకర్, సురేష్,రమేష్, ఆర్.ఎస్.ఐ లు రాజు,శ్రవణ్ యాదవ్, దిలీప్, సాయి కిరణ్, ఆర్మ్డ్ సిబ్బంది, సివిల్ సిబ్బంది,హోమ్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న బోయిన్ పేట్

# కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి

**-రెండు నెలల వేతనంతో పేద కుటుంబాలకు అండ**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (మంథని) జులై 27 :** ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ మంథని పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్ తమకు వచ్చిన రెండు నెలల కౌన్సిలర్ వేతనాన్ని బోయిన్‌పేట అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం వినియోగించారు. ఈ సందర్భంగా బోయిన్‌పేటకు చెందిన నాలుగు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గెలిచిన తర్వాత మరచిపోయే నాయకులు ఉన్న ఈ రోజుల్లో, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే ప్రజాప్రతినిధి బాధ్యత అనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్ తెలిపారు. రాజకీయ పార్టీల మద్దతు లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచి, ప్రజల ఆశీర్వాదంతో జిల్లా లోనే భారీ మెజారిటీతో గెలిచిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెల కౌన్సిలర్ వేతనాన్ని ప్రజలకే వినియోగిస్తానని ప్రకటించగా,అందులో భాగంగా రెండు నెలల వేతనంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.పేద కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బియ్యం,కిరాణా సరుకులు, నిత్యావసర వస్తువులను అందజేసి వారికి అండగా నిలిచారు.ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని,ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండటం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్వంత డబ్బులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన పోతరవేని శ్రీలతక్రాంతికుమార్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడం,అత్యవసర పరిస్థితుల్లో అండగా నిలవడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం వంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయబోనని, బోయిన్‌పేట అభివృద్ధి, వార్డు ప్రజల సంక్షేమం, పేదల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.నీతి, నిజాయితీ, నిస్వార్థంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.ప్రజల సహకారం, విశ్వాసంతోనే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి బోయిన్‌పేటను ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ప్రజావాణికి 162 దరఖాస్తుల రాక

**-అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**





**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, జులై 27 :** ప్రజావాణికి 162 దరఖాస్తులు వచ్చాయి.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.మొత్తం 162 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందించి.. పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

**ఆర్డీఓ కార్యాలయాల్లో..**

సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 7 దరఖాస్తులు రాగా,వాటిని సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 1 దరఖాస్తు రాగా, సంబంధిత శాఖ అధికారికి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు



**చురకలు ప్రతినిధి కరీంనగర్ జులై 27 :** భారతరత్న, మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం 11వ వర్ధంతి కార్యక్రమం ప్రజాప్రయోజనాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ నగర్ లో కలాం చౌక్ వద్ద ఘనంగా నిర్వహించారు. దివంగత ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా ఈ సందర్భంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రజా ప్రయోజనాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ఆమీర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం డీఆర్డీవో ఇస్రో వంటి గొప్ప సంస్థలో సేవలు అందించి, శాస్త్రవేత్తగా మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా యువతకు ఆదర్శంగా నిలిచారు. రాష్ట్రపతిగా పీపుల్స్ ప్రెసిడెంట్ గా అందరి మన్ననలు పొందారు. నేటి యువత, విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి. కలాం భౌతికంగా దూరమైన ఆయన ఆశయాలను లక్ష్యాలను గురించి పనిచేయాలని, దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ బొట్ల శ్యామల – కిరణ్ కుమార్, పిల్లి లక్ష్మణ్, తుమ్ నారాయణ,అబ్దుల్ రెహమాన్, సాగర్, మేరాజ్, రమేష్, ప్రవీణ్, రాజశేఖర్, అక్బర్, ఎస్దాని, మల్లికార్జున్, వెంకటేష్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సర్పంచ్‌ల ఫోరమ్ ప్రధాన కార్యదర్శిగా అజ్మీరా తిరుపతి నాయక్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జులై 27 :** రాజన్న సిరిసిల్ల జిల్లా సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు శ్రీ అన్నబోయిన తిరుపతిగారి ఆధ్వర్యంలో జిల్లా సర్పంచ్‌ల ఫోరమ్ ప్రధాన కార్యదర్శిగా శ్రీ అజ్మీర తిరుపతి నాయక్ గారిని నియమించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన పంపిన లేఖ లో నూతనంగా నియమితులైన ప్రధాన కార్యదర్శి తిరుపతి నాయక్ గారికి హృదయపూర్వక అభినందనలు చెపుతూ సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం,గ్రామాల అభివృద్ధి, సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గా నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు,కార్యవర్గ సభ్యులకు తిరుపతి నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**- వరంగల్, హనుమకొండ కలెక్టర్లకు 'టిజివైఎస్' వినతి**



**చురకలు ప్రతినిధి, వరంగల్ జులై 27 :** బహుజన విప్లవ వీరుడు, స్వరాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ జయంతి వేడుకలను ఆగస్టు 18న గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జెఎసి చైర్మన్ గట్టు నరేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకుGYS ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా గట్టు నరేష్ గౌడ్ మాట్లాడుతూ...పాపన్న గౌడ్ బహుజనుల ఆత్మగౌరవానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీక అని కొనియాడారు.ఆయన త్యాగాలను నేటి తరానికి తెలియజేసేలా ప్రజాప్రతినిధులు, గౌడ మరియు బహుజన సంఘాలను భాగస్వామ్యం చేస్తూ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు అధికారులకు ముందస్తు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్లను కోరారు.అలాగే జిల్లా స్థాయి ప్రధాన కార్యక్రమాన్ని బహిరంగ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు బండారి జనార్దన్ గౌడ్, చిర్ర సుమన్ గౌడ్,నాగపూరి వెంకటేష్ గౌడ్,నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ అయ్యి వృదాగా ప్రవహిస్తున్న నీరు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూలై 27** : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నుంచి అగ్రహారం వెళ్లే ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ కావడంతో భారీగా నీరు వృథాగా ప్రవహిస్తోంది. పైప్ నుంచి ఎగిసిపడుతున్న నీరు రోడ్డంతా వ్యాపించి వాహనదారులు,పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై నీరు నిలవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీని మరమ్మతు చేసి,నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## శివపరాశక్తి పీఠంలో మహా రుద్రాభిషేకం





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూలై 27 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ లోని శ్రీ శివ పరాశక్తి పీఠంలో సోమవారం మహాశివుడికి విశేష పూజలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు కాసు మనోహర్ రాజు గురుస్వామి ఆధ్వర్యంలో గొల్లపల్లికి చెందిన బుగ్గ కృష్ణమూర్తి శర్మ నేతృత్వంలో మహా శివుడికి నమక, చమక, రుద్రాభిషేకం తో పాటు, పంచామృతాలతో విశేష అభిషేకం సప్త హారతులు బస్మాభిషేకం నిర్వహించారు, మనోహర్ రాజు బొప్పాపూర్ గ్రామంలో గత కొంతకాలం క్రితం ఏర్పాటు చేయగా వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి ప్రతి సోమవారం, అమావాస్య రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నారు,ప్రత్యేక పూజా కార్యక్రమంలో భూపాలపల్లి జెన్కో ఎడిఈ కాంచనపల్లి పూర్ణచందర్ రాజుజాన్సీరాణి దంపతులు దయాకర్ రాజు నాగరాణి ధంపతులువివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.భక్త కోటికి తీర్థ ప్రసాదాలు అన్నప్రసాదాలు వితరన చేశారు.

## బిజెపి నాయకుల ముందస్తు అరెస్ట్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూలై 27 :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ను బి జె వై ఎం ప్రతినిధులు ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట పోలీసులు బిజెపి బిజే వై ఎమ్ నాయకులను సోమవారం ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఉడుగుల యాదగిరి, ఎస్టీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు మాలోత్ కిరణ్ నాయక్, బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి దాసరి గణేష్ సల్ల జితేందర్ రెడ్డి తదితరులను పోలీసులు ముందస్తు అరెస్ట్‌లు చేసి వ్యక్తిగత పూచికత్తుపై సాయంత్రం వదిలిపెట్టారు. పోలీసుల ముందస్తూ అరెస్టులను బిజెపి బిజెవైఎం నాయకులు తీవ్రంగా ఖండించారు.

### కొత్తగట్టు మాజీ సర్పంచ్..

# గోపు వెంకట నరసింహారెడ్డి ఇకలేరు



**-కొత్తగట్టులో విషాదం**
**-సుదీర్ఘకాలం సర్పంచ్‌గా పనిచేసిన గోపు వెంకట నరసింహా రెడ్డి**

**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)**

శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోపు వెంకట నరసింహారెడ్డి (90) వృద్ధాప్య సమస్యలతో సోమవారం కన్నుమూశారు .ఆయన 24 ఏళ్ల సుదీర్ఘకాలం 1964 నుండి 1988 వరకు గ్రామ సర్పంచిగా సేవలందించారు. ఆయనకు సౌమ్యునిగా పేరు ఉంది. గ్రామ అభివృద్ధికి ఆయన శక్తివంతన లేకుండా కృషి చేశారు. ఆయన మాటే వేదవాక్కుగా ఉండేది. రాజకీయ దిగ్గజాలు దివంగత సింగాపురం రాజేశ్వరరావు, కేతిరి సాయిరెడ్డి, దుగ్గిరాల వెంకట్రావు, ముద్దసాని దామోదర్ రెడ్డి, కెప్టెన్ వి లక్ష్మి కాంతారావు తదితరులతో వెంకట నరసింహారెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఆయనంటే అందరికీ గ్రామంలో గౌరవం ఉండేది. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. పలువురు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వెంకట నరసింహారెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి ఉపాధ్యాయునిగా పనిచేస్తుండగా, మరో కుమారుడు శ్రీకాంత్ రెడ్డి అమెరికాలో స్థిరపడ్డారు. శ్రీకాంత్ రెడ్డి అమెరికా నుండి వచ్చిన అనంతరం గ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ తదితరులు వెంకట నరసింహారెడ్డి మృతికి సంతాపం తెలిపారు. అలాగే సీనియర్ జర్నలిస్ట్ అవునూరి సమ్మయ్య, టెట్రా స్కూల్ కరెస్పాండెంట్ ముచ్చ నారాయణరెడ్డి, ఇనకొండ బుచ్చిరెడ్డి, పోరెడ్డి దామోదర్ రెడ్డి, కోరెం సంజీవ రెడ్డి, సుంకిశాల సంతోష్ రావు, కాకతీయ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వేణుమాధవ్, స్థానిక నాయకులు మడ వెంకటరెడ్డి, మత్స్యగిరి స్వామి దేవస్థానం చైర్మన్ కోరం రాజిరెడ్డి, ఉప్పుగళ్ల మల్లారెడ్డి, మాడ సుజాత రాజిరెడ్డి,మాదారపు విద్యాసాగర్ రావు, పాత్రికేయులు కోరం సుధాకర్ రెడ్డి, కోరం శ్రీనివాస్ రెడ్డి, తిరునగరి ఆంజనేయస్వామి, బిజెపి నేత శ్రీనివాస్ రెడ్డి, సురేష్ గౌడ్, పూదరి నరేష్, పూదరి తిరుపతి, వ్యాపారవేత్త విష్ణు తదితరులు మాజీ సర్పంచ్ వెంకట నరసింహారెడ్డి మృతికి సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.





# ఐఐటీ విద్యార్థికి కేటీఆర్ భరోసా...

**-ల్యాప్ టాప్ అందించి కళాశాల ఫీజు సైతం చెల్లిస్తా అని హామీ**
**-కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థి అభినవ్ తల్లిదండ్రులు**

**చురకలు ప్రతినిది,ఎల్లారెడ్డిపేట జూలై 27 :** బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా విద్యార్థులకు తన వంతుగా సహాయ, సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సోమవారం ఐఐటీ లో వారణాసి లో సీటు సాధించిన సిరిసిల్ల కు చెందిన గడ దాస్ అభినవ్ తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, శ్రీలత లతో కలిసి హైదరాబాద్ లో కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. నేత కుటుంబానికి చెందిన అభినవ్ ను ఐఐటి లో సీటు సాధించడంతో కేటీఆర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. విద్యార్థికి ల్యాప్టాప్ ను గిఫ్ట్ స్మైల్ కింద అందజేశారు. కళాశాల ఫీజు కూడా తాను చెల్లిస్తానని భరోసా ఇచ్చి, చక్కగా చదువుకొని , తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని , ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కు విద్యార్థి అభినవ్, తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ శ్రీలతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్ కు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

### నేడు శాఖాంబరిగా

# దర్శనం ఇవ్వనున్న శ్రీమహాలక్ష్మి

**- గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు**
**-ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 27 :** ఆషాడశుద్ధ పౌర్ణమి (గురు పౌర్ణమి) పర్వదినమును పురస్కరించు కొని బుధవారం మంథని పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ దేవాలయంలో "శాఖాంబరి"ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్ తెలిపారు. ఉదయం 4 గంటలకు అమ్మవారికి అభిషేకం,6 గంటలకు అర్చన అనంతరము శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించిన అనంతరం ఉదయం 9:30 గంటలకు అమ్మవారు శాఖాంబరిగా భక్తులకు దర్శనం ఇవ్వను న్నారని ఆయన తెలిపారు. ఆలయంలో నిర్వహించనున్న శ్రీలలితా సహస్రనామ పారాయణం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

### మంత్రి పొన్నంను కలిసిన

# టీఎన్‌జీఓ నాయకుడు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 27 :** టీఎన్జీవోస్ పెద్దపల్లి అర్బన్ జెంట్స్ కార్యదర్శిగా ఎన్నికైన గాండ్ల రమేష్ పటేల్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై త్వరగా స్పందించి పరిష్కరించాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని రమేష్ తెలిపారు. తనను అర్బన్ జెంట్స్ కార్యదర్శిగా ఎన్నుకున్న తోటి ఉద్యోగులతో పాటు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరు శంకర్, నాయకులు సందీప్ రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, సహకరించిన ప్రతి ఒక్కరికీ గాండ్ల రమేష్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు.

# విత్తన మేళా - రైతులకు సువర్ణావకాశం

**- ఇబ్రహీంపట్నం రైతు వేదికలో మూడు రోజుల పాటు నిర్వహణ**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (27) :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచడంతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లోని రైతు వేదికలో సోమవారం విత్తన మేళాను ప్రారంభించారు. ఈ విత్తన మేళా జూలై 27 నుంచి 29వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10:30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అకు రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఆకు రాజ్ కుమార్ మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కందులు, మొక్కజొన్న విత్తనాలు, వివిధ రకాల కూరగాయల విత్తనాలు, కూరగాయల నారు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ద్వారా మినుములు, పెసర్లు, నువ్వుల విత్తనాలు రైతులకు అందజేస్తున్నామని పేర్కొన్నారు. పంటల దిగుబడులు పెంచేందుకు ఉపయోగపడే నానో యూరియా మరియు నానో డీఏపీ కూడా మేళాలో అందుబాటులో ఉన్నాయని,వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు తెలుసుకుని తమ సాగులో వినియోగించుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, సమతుల్య ఎరువుల వినియోగం, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విత్తన మేళాకు హాజరై నాణ్యమైన విత్తనాలను పొందడంతో పాటు నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోరిగం రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల పవన్, సర్పంచ్ బద్దం గోపి, ఉపసర్పంచ్ నాంపల్లి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామాల రైతులు, విత్తన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి

**- ఇబ్రహింపట్నం ఎంపీడీవో సీహెచ్ గణేష్**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (27) :** ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకించవచ్చని,తద్వారా భూగర్భ జలమట్టాలు పెరిగి భవిష్యత్తులో నీటి సమస్యలను అధిగమించవచ్చని ఇబ్రహీంపట్నం ఎంపీడీవో సీహెచ్ గణేష్ అన్నారు.సోమవారం ఇబ్రహింపట్నం మండల మహిళా సమాఖ్య భవనంలో మహిళలతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి చేరుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న జలసిరి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మహిళలు తమ కుటుంబ సభ్యులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందుబాటులో ఉంచేందుకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండాలని పేర్కొన్నారు. ఎపియం శంకర్, సిబ్బంది,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# నీటిని పొదుపు చేసి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 27 :** ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యం లో నీటి పొదుపు చేసి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ రైతులకు సూచించారు. పోలాస గ్రామ రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో ఎల్నినో ప్రభావం వల్ల వరి సాగుకు ప్రత్యామ్నాయంగా నాణ్యమైన విత్తనాల పంపిణీ విత్తన మేళా నిర్వహిచగా జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.సంజయ్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేవని, ప్రాజెక్టుల్లో నీళ్లు లేక విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని తెలిపారు. భవిష్యత్తులో తీవ్రనీటి కరువు వచ్చే అవకాశం ఉందని, రైతులు సాగు నీరు పొదుపుగా వాడాలని సూచించారు . రైతులు వరికే పరిమితం కాకుండా కంది, పెసర, మినుము,మొక్కజొన్న, బంతి, కూరగాయలు వంటి ఆరుతడి పంటలు వేయాలని, డ్రిప్, ఎయిర్ డ్రిప్, ఎయిర్ గన్ పద్ధతులు వాడాలని కోరారు. ప్రభుత్వం బోనస్, మద్దతు ధర ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజెంగి నందయ్య, డిఏవో భాస్కర్, ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, హార్టీకల్చర్ అధికారి లత, సర్పంచ్ మిల్కూరి శంకరయ్య, తహసీల్దార్ షాదాబ్ హకీమ్, ఏడిఏ తిరుపతి నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీకే ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 27 :** జిల్లాలో డి.ఏ.పీ. ఎరువుల బ్లాక్ మార్కెట్ పై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. బోగ శ్రావణి జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డి.ఏ.పీ. ఎరువుల ఎమ్మార్పీ ధర రూ.1,350 మాత్రమే ఉన్నప్పటికీ, కొంతమంది డీలర్లు ఒక్కో బస్తాను రూ.1,950 వరకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. వ్యవసాయ సీజన్లో ఎరువులపై రైతులకు ఉన్న అత్యవసర అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్కు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎమ్మార్పీకే ఎరువులు అందేలా అధికారులు కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని, అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న డీలర్లు, షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా బీజేపీ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బద్దం తిరుపతి రెడ్డి, జిల్లా కార్యదర్శులు ముత్యం రెడ్డి, పాత రమేష్, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నారపక అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు




**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (27) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రెండవ విడత ఉపాధ్యాయుల అంతర్గత శిక్షణ కార్యక్రమం ప్రారంభమయ్యాయి. శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల విద్యాధికారి బండారి మధు మాట్లాడుతూ ఈ మూడు రోజులు జరిగే శిక్షణలో ఉపాధ్యాయులు రిమిడియాల్ క్లాసుల పైన శిక్షణ కార్యక్రమం ఉంటుందని, అలాగే రెమిడీయాలు తరగతులను సమర్ధవంతంగా నిర్వహించగలరని సూచించారు. అదేవిధంగా తరగతి గదిలో రెమిడీయాల్ క్లాసులపైన ఏమైనా సందేహాలు వ్యక్తమౌతే ఆర్పీలను అడిగి తెలుసుకోగలరని ఈ సందర్భంగా సూచించారు. ఇట్టి శిక్షణ కార్యక్రమంలో ఆర్పీలు శ్రీధర్,వెంకటేశ్వరరావు, రఘునాథ్,వేణుగోపాల్,ఉపాధ్యాయులు మరియు ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## జలసిరి పనులకు శ్రీకారం



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (27) :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం గ్రామంలో ఫార్మ్ పాండ్ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, రైతులకు సాగునీటి అందుబాటు పెంపు లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడివో సిహెచ్ గణేష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నీటి వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పెంపు కోసం జలసిరి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఫార్మ్ పాండ్ల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని వ్యవసాయ అవసరాలకు వినియోగించుకోవచ్చని,దీంతో రైతులకు ప్రయోజనం చేకూరు తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అదికారి అకు రాజ్ కుమార్,మార్కెట్ కమిటీ చైర్మన్ భోరిగాం రాజు,గ్రామ సర్పంచ్ బద్దం గోఫి,ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్,పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ,విండో చైర్మన్ జాల్లలపవన్,మాజీ కోప్షన్ ఎలేటి చిన్నరెడ్డి,సుంకె రాజశేఖర్ పాల్గొన్నారు.

## అర్ధరాత్రి విద్యుత్ సిబ్బంది సేవలు అభినందనీయం



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్,జులై 27 :** భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అర్ధరాత్రి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా విద్యుత్ సిబ్బంది చేసిన సేవలు అభినందనీయమని సర్పంచ్ పుల్ల జగన్ కొనియాడారు. మండల జగ్గసాగర్ గ్రామంలోని పోచమ్మ వాడలో రాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి విద్యుత్ ట్రాన్సపార్మర్ కాలిపోవాడంతో వెంటనే విషయం తెలిసిన విద్యుత్ అధికారులు స్పందించి రెండు లక్షల విలువగల నూతన ట్రాన్స్ఫర్మార్ మెట్ పల్లి నుంచి తీసుకవచ్చి అదే రాత్రి బిగించి గ్రామస్థులకు విద్యుత్ సరఫరా చేయడంతో విద్యుత్ సిబ్బంది సేవలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. దీనికి సహకరించిన విద్యుత్ ఉన్నతధికారులకు మరియు లైన్ ఇన్స్పెక్టర్ శేఖర్, లైన్మెన్ లక్ష్మన్,రాజు,జలపతి లకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# జయన్న ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**-హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**
**-ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ ప్యూరీఫైర్లు ప్రారంభించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జులై 27 :** హుజురాబాద్ ప్రాంతంలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న కార్యక్రమాలు అభినందనీ యమని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రశంసించారు.సోమవారం మండలం లోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను ఆయన ప్రారంభించారు.రాజపల్లిలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ను జయన్న ఫౌండేషన్ నిర్వాహకులు గుడిపాటి జయపాల్ రెడ్డి తో కలిసి ఆయన లాంచనంగా ప్రారంభించారు. అలాగే కాట్రపల్లి కందుల పెద్ద పాపయ్యపల్లి హుజురాబాద్ సింగాపురం సిరిసపల్లి చెల్పూరు తదితర పాఠశాలల్లో ప్లాంట్లను ప్రారంభించారు.ఈ సందర్భం గా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు దృశ్య జయన్న ఫౌండేషన్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆధునిక వాటర్ ప్యూరిఫైయర్ లు ఎంతగానో ఉపయోగపడతాయని, విద్యార్థుల దాహార్తి తీర్చుతాయని అన్నారు. "విద్యార్థులే దేశ భవిష్యత్తు.వారికి నాణ్యమైన విద్యతో పాటు స్వచ్ఛమైన తాగునీరు,మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం మనందరి బాధ్యత అని,ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించేలా అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని స్పష్టం చేశారు.విద్యార్థుల భవిష్యత్తులో పెట్టే ప్రతి అడుగు సమాజ అభివృద్ధికి బలమైన పునాది అవుతుంది" అని అన్నారు.చెల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని దశల వారీగా అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాభ్యాస వాతావరణం కల్పించేందుకు అవసర మైన తరగతి గదులు,తాగునీటి సౌకర్యం,పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్,గందె శ్రీనివాస్,తిరుమల్, ముత్యం రాజు,సర్పంచ్ మల్ల రెడ్డి, రాజు,స్థానిక నాయకులు,జయన్న ఫౌండేషన్ ప్రతినిధులు గుడిపాటి సరిత జైపాల్ రెడ్డి ఉపాధ్యాయులు,విద్యార్థులు ,తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల
# విశ్వాసాన్ని పెంచిన డాక్టర్. మహమ్మద్. ముక్రమ్




**-తన భార్యకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే హైరిస్క్ ప్రసవం చేయించి ఆదర్శంగా నిలిచిన ప్రముఖ సర్జన్**
**-డాక్టర్. మహమ్మద్ ముక్రమ్ దంపతులకు రాష్ట్ర స్థాయి ఆదర్శ సేవా పురస్కారం ప్రకటించాలని ప్రజల విజ్ఞప్తి**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జులై 27 :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రజలకు ప్రత్యక్షంగా చాటి చెప్పే విధంగా జగిత్యాల ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మహమ్మద్ ముక్రమ్ తీసుకున్న నిర్ణయం ప్రస్తుతం ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. రక్తహీనతతో పాటు ముందస్తు ప్రసవ నొప్పులతో అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఉన్న తన సతీమణి డాక్టర్. సోఫియా ముక్రమ్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లకుండా, తాను సేవలందిస్తున్న జగిత్యాల ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలోనే చేర్పించి అత్యంత ప్రమాదకరమైన శస్త్రచికిత్స ద్వారా సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. ప్రస్తుతం తల్లి. మగ శిశువు ఇద్దరూ పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్. మహమ్మద్ ముక్రమ్ మాట్లాడుతూ. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించి ప్రభుత్వ వైద్య సేవలపై విశ్వాసం పెంపొందించడమే తన ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు కూడా ప్రైవేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోవని, ఆధునిక వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్న తన భార్యకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే శస్త్రచికిత్స ద్వారా సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. డాక్టర్. శైలజ (గైనకాలజిస్టు) డాక్టర్. తిరుమల (సీనియర్ రెసిడెంట్, ఐసీయూ ఇన్‌చార్జ్) డాక్టర్. సాయి (శిశు వైద్య నిపుణుడు) డాక్టర్. మహేష్ (అనస్థీషియా నిపుణుడు) లతో పాటు ఆర్ఎంఓ డాక్టర్. నరేష్ మరియు డాక్టర్. స్వరూపలకు డాక్టర్. ముక్రమ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంఘటనపై స్పందించిన మిల్లత్ ముస్లిం వెల్ఫేర్ సంఘం కోరుట్ల అధ్యక్షుడు మహమ్మద్ చాంద్ పాషా మాట్లాడుతూ. డాక్టర్. మహమ్మద్ ముక్రమ్ చేసిన ఈ చర్య ప్రతి వైద్యుడికి, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఆదర్శప్రాయమని అన్నారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచేందుకు ఆయన చేసిన కృషిని గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జగిత్యాల జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ( డి. ఎం. హెచ్. ఓ) డాక్టర్. మహమ్మద్ ముక్రమ్ మరియు ఆయన సతీమణి సోఫియా ముక్రమ్‌లకు ఆదర్శ సేవా పురస్కారం ప్రదానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల ప్రతిష్టను పెంచే ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తుందని ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలపై మరింత నమ్మకం పెంచుకునేలా చేస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# "నేను సైతం" సీసీ కెమెరాల ఏర్పాటు



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జులై 27 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో నేర నియంత్రణలో భాగంగా వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా బాలాజీ కిరాణా స్టోర్ యజమాని సహకారం తో, రహదారి స్పష్టంగా కనిపించే విధంగా రెండు నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ పి. ఉదయ్ కుమార్ మాట్లాడు తూ, సమాజంలో నేరాల నియంత్రణకు పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి వ్యాపార సంస్థ,వాణిజ్య సముదాయం, దుకాణ యజమానులు తమ దుకాణాల ఎదుట రహదారు లు స్పష్టంగా కనిపించేలా నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడ మే కాకుండా, నేరాలు జరిగిన సందర్భాల్లో నిందితులను త్వరితగతిన గుర్తించి చట్ట పరమైన చర్యలు తీసుకోవడా నికిఎంతోదోహదపడుతుందని వివరించారు.పోలీసు శాఖ చేపడుతున్న "నేను సైతం" కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి తమ ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత సమాజ నిర్మాణంలో భాగస్వా ములు కావాలని పిలుపుని చ్చారు.

## గ్రేటర్ వరంగల్ 'టీఆర్ఎస్' జిల్లా అధ్యక్షుడిగా
# డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు



**చురకలు ప్రతినిధి,వరంగల్ జులై 27 :** తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) పార్టీ సంస్థాగత విస్తరణలో భాగంగా గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ నాయకులు,లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు నియామక మయ్యారు.ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు అధిష్ఠానం సోమవారం రోజున నియామక పత్రాన్ని విడుదల చేసింది.ఈ బాధ్యత ద్వారా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 66 డివిజన్లతో పాటు వరంగల్ తూర్పు,వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో పార్టీ కార్యకలాపాలను వెంకటేశ్వర్ రావు పర్యవేక్షించనున్నారు. ఆయన నియామకం పట్ల పార్టీ నాయకులు,కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ .. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ వరంగల్‌లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తానని, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక డివిజన్లు గెలుచు కోవడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.కల్వకుంట్ల కవిత నాయకత్వం లో టీఆర్ఎస్‌ను బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేస్తానని వెల్లడించారు.

# టీఆర్ఎస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా డాక్టర్ రఘు నియామకం






**చురకలు ప్రతినిధి కోరుట్ల, జులై 27 :** టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా డాక్టర్ రఘును పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియమించారు. సోమవారం అధికారిక నియామక పత్రాన్ని విడుదల చేశారు.ఇటీవల కోరుట్లలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో డాక్టర్ రఘు తన అనుచరులతో కలిసి తెలంగాణ రక్షణ సేనలో చేరిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ డాక్టర్ రఘు చేరికతో పార్టీకి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లైందని పేర్కొన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసి, రాబోయే ఎన్నికల్లో డాక్టర్ రఘును అసెంబ్లీకి పంపేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.డాక్టర్ రఘును నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణం మరింత బలపడటంతో పాటు ప్రజా సమస్యలపై ఉద్యమాలు, పార్టీ విస్తరణ కార్యక్రమాలకు మరింత వేగం చేకూరుతుందని పార్టీ నాయకులు తెలిపారు.డాక్టర్ రఘు నియామకాన్ని పార్టీ శ్రేణులు, ఆయన అనుచరులు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు.